క్లుప్తంగా

సుస్థిర అభివృద్ధి సర్వేను వేగవంతం చేయాలి

● డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి



పెండింగ్ ఫైల్స్‌పై ఆరా తీస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

కర్నూలు (న్యూటౌన్): సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు చేపట్టిన సర్వేను వేగవంతం చేయాలని కర్నూలు డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించిన అభివృద్ధి పనులను పూర్తి చేసి బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఆయుస్మాన్ భారత్ ఇన్సూరెన్స్ కార్డులు, మ్యారేజ్ సర్టిఫికెట్‌లు బాధితులకు అందజేయాలన్నారు. బియ్యం కార్డులు, 0 నుంచి 5 ఏళ్లల్లోపు పిల్లలకు ఆధార్ కార్డు ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేట్ చేయించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ భాస్కర్ నాయుడు, జూనియర్ అసిస్టెంట్ వినోద్ పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయండి

కల్లూరు: మన బడి నాడు–నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు సూచించారు. శనివారం తడకనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన శ్లాబ్ పనులను పరిశీలించారు. పనులను పరిశీలించాలని హెచ్‌ఎంకు సూచించారు. అలాగే పెద్దపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జెకె సీడ్స్ వారు అందజేసిన కంప్యూటర్‌ను ఎంఈఓ ప్రారంభించారు. ఆయన వెంట ఏపీఎస్‌డబ్ల్యూ ఏఈ మునీశ్వర్ ఉన్నారు.

గార్గేయపురం పంచాయతీకి రూ.4.8 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు (న్యూటౌన్): వేలం పాటల ద్వారా గార్గేయపురం పంచాయతీకి రూ.4.8లక్షల ఆదాయం సమకూరిందని డీఎల్‌పీఓ తిమ్మక్క తెలిపారు. పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం టమాట, సంత మార్కెట్ల వేలం పాట నిర్వహించారు. టమాట మార్కెట్‌ను రూ.4 లక్షలకు డి సర్దార్‌బేగ్, సంత మార్కెట్‌ను రూ.86 వేలకు ఎం బాలచెన్ను దక్కించుకున్నట్లు డీఎల్‌పీఓ తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


దరఖాస్తు గడువు పెంపు

కల్లూరు: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం(డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల) 2023–2024 విద్యా సంవత్సరానికి ఐదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు గడవును ఈ నెల 31వ తేదీ వరకు పెంచినట్లు చిన్నటేకూరు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

ఓర్వకల్లు: ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న కోరారు. శనివారం నన్నూరు గ్రామంలో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆటో ప్రచారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ బీజేపీ నాయకులు అధికారంలోకి రాకముందు కార్మికులు, కర్షకులకు అనేక హా మీలిచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు మధుసూదన్, ప్రజా సంఘాల నాయకులు మాసూంబాషా, మల్లేష్, ఆంజనేయులు, లక్ష్మన్న, మాధవస్వామి, బషీర్, దస్తగిరి పాల్గొన్నారు.

మూల పెద్దమ్మకు రూ.1.7 లక్షల ఆదాయం



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

గడివేముల:మండలకేంద్రంలో వెలసిన మూల పెద్దమ్మకు రూ.1.7 లక్షల ఆదాయం సమకూరింది. ఇటీవల జరిగిన అమ్మవారి జాతర సందర్భంగా హుండీల్లో భక్తులు వేసిన కానుకలను శనివారం ఆలయ చైర్మన్ చిన్నన్న, ఈఓ మోహన్,పర్యవేక్షణాధికారి కిరణ్ ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం రూ.1,73,896 నగదు సమకూరినట్లు చైర్మన్ తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.29,038 ఎక్కువ వచ్చిందన్నారు.

పల్లెల్లోనే పంటల కొనుగోళ్లు

● రవాణా ఖర్చులు ఆదా
● మద్దతుధరకే దిగుబడుల విక్రయం
● రైతుల నుంచి విశేష స్పందన

దిగుబడులు విక్రయించుకోవాలంటే ఒకప్పుడు తలకు మించినభారంగా ఉండేది. విత్తు వేసింది మొదలు పంట చేతికొచ్చేంత వరకు కంటికి రెప్పల కాపాడుకోవడం ఒక ఎత్తైతే.. ధాన్యాన్ని విక్రయించుకోవడం మరో ఎత్తు. మార్కెట్ ఉండేది పట్టణాలు, నగరాల్లోనే. అక్కడకు తరలించాలంటే గ్రామాల నుంచి సరైన రవాణా సౌకర్యం ఉండేది కాదు.. ఒక వేళ ఉన్నా వాహనాల బాడుగ భరించాల్సి వచ్చేది. ఒక్కోసారి ధర లేక వచ్చిందంతా బాడుగలకే సరిపోయేది. ఇదంతా గతం. ఇప్పుడు రైతన్నలను జగనన్న ప్రభుత్వం రాజులను చేస్తోంది. వారి కష్టాలను ఒక్కొక్కటిగా తొలగిస్తోంది. పంట సాగుకు ఆర్థిక సాయం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సమకూర్చిన ప్రభుత్వం.. గ్రామాల్లోనే మార్కెట్లను ఏర్పాట్లు చేసి దిగుబడులు మద్దతు ధరతో కొనుగోళ్లనూ ప్రారంభించి అన్నదాతకు అండగా నిలుస్తోంది.

గడివేముల: ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు అన్నదాతలకు ఉపయోగకరంగా ఉన్నాయి. తమ దిగుబడులను గ్రామాల్లోనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయించుకుంటున్నారు. రవాణా ఖర్చు మిగులుతుండటం, మద్దతు ధర లభిస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని బిలకలగూడూరు, పెసరవాయి, కరిమద్దెల, చిందుకూరు, గడిగరేవుల, బూజునూరు గ్రామాల్లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. జొన్న క్వింటా రూ.2,970, పప్పు శనగ రూ.5,335 మద్దతు ధర ప్రకటించడంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో పంటలను అమ్ముకుంటున్నారు. వ్యాపారుల కంటే ప్రభుత్వం ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో కేంద్రాలలో కొనుగోలు చేయడానికి అన్నదాతలు ముందుకు వస్తున్నారు. రవాణా, సంచులకు అయ్యే ఖర్చులను సైతం ప్రభుత్వమే భరిస్తోంది.



పెసరవాయి గ్రామంలో జొన్నలను తూకం వేస్తున్న దృశ్యం



కరిమద్దెలలో పప్పు శనగల నాణ్యతను పరిశీలిస్తున్న నంద్యాల ఏడీఏ రాజశేఖర్

300 క్వింటాళ్లు అమ్ముకున్నా



పది ఎకరాల్లో జొన్న పంట సాగు చేయగా 300 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.18 వేల చొప్పున 10 ఎకరాలకు దాదాపు రూ.2లక్షల వరకు ఖర్చు వచ్చింది. క్వింటం రూ.2,970 మద్దతు ధరతో దిగుబడులు అమ్ముకోగా రూ.8,91,000 వచ్చింది. బయటి మార్కెట్ కంటే ప్రభుత్వం ఎక్కువ ధరతో కొనుగోలు చేయడం ఆనందంగా ఉంది. – కుంచ పరమేశ్వరరెడ్డి, పెసరవాయి

రైతు ప్రభుత్వం



జగనన్న ప్రభుత్వం రైతుల ప్రభుత్వం. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతన్నలు కొనుగోలు చేయడానికి ముందుకు వస్తున్నారు. జొన్న, పప్పు శనగ కేంద్రాలకు రైతుల నుంచి స్పందన బాగుంది.ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అప్పటి నుంచి సకాలంలో వర్షాలు పడటంతో రైతులు వ్యవసాయంపై మక్కువ చూపుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను రైతులు దళారులకు అమ్ముకొని వారి చేతుల్లో మోసపోవడాలు ఉండవు. – శిరుప శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు

మంచి స్పందన ఉంది

కొనుగోలు కేంద్రాలకు రైతుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇప్పటి వరకు జొన్నలు 85 మెట్రిక్ టన్నులు, పప్పు శనగలు 89 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. బిలకలగూడూరు కేంద్రంలో 1,000, బూజునూరు 150, చిందుకూరు 200, పెసరవాయి 2,500, కరిమద్దెల 150, గడిగరేవుల 150 క్వింటాళ్లను కొనుగోలు చేశాం. శనగ 750 క్వింటాళ్లను పెసరవాయి గ్రామంలో ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇంకా ఎవరైనా రైతులు దిగుబడులు విక్రయించుకోవాలనుకుంటే ఆర్బీకేలలో పేర్లను నమోదు చేసుకోవాలి. – హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

వార్డెన్ సస్పెన్షన్

నంద్యాల: పాణ్యం మండలం నెరవాడమెట్ట గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఇటీవల విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఘటనపై కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ విచారణకు ఆదేశించారు. ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు విచారణ చేసి నివేదిక సమర్పించగా వార్డెన్ పద్మావతిని సస్పెండ్ చేసినట్లు డీఆర్‌ఓ పుల్లయ్య శనివారం తెలిపారు. అధికారులు గుర్తించిన లోపాల ఆధారంగా కలెక్టర్ నిర్ణయం తీసుకున్నట్లు డీఆర్‌ఓ చెప్పారు.

వివాదాస్పద స్థలాల పరిశీలన

సి.బెళగల్: మండల కేంద్రంలోని వివాదాస్పద స్థలాలను శనివారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మండల ఇన్‌చార్జ్ సర్వేయర్ బాలనాయక్, గ్రామ సచివాలయ సర్వేయర్ వేణుగోపాల్ నాయు డు, వీఆర్‌ఏలతో కలిసి గ్రామంలో పర్యటించారు. 446, 447 సర్వే నంబర్లలోని స్థలాల సరి హద్దులను గుర్తించి వివరాలను నమోదు చేసుకున్నారు.

రాహుల్‌గాంధీపై కక్షపూరిత చర్యలు తగదు

కల్లూరు: కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీపై బీజేపీ కక్షపూరిత చర్యలు మానుకోవాలని ఆ పార్టీ నంద్యాల పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు, ఏఐసీసీ సభ్యుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ హితవు పలికారు. రాహుల్‌గాంధీని తన పార్లమెంటేరియన్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తాలో నరేంద్రమోదీ, అమిత్ షా చిత్ర పటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహ మాట్లాడుతూ ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లో సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాంబశివుడు, బాలస్వామి, అబీబ్ పఠాన్ ఖాన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి



ఎర్రదొడ్డిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, హౌసింగ్ డీఈఈ

కోడుమూరు రూరల్: జగనన్న కాలనీలలో లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శనివారం ఎర్రదొడ్డి జగనన్న కాలనీని ఎంపీడీఓ చంద్రశేఖర్.. హౌసింగ్ డీఈఈ వాసుదేవరావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇసుక, ఐరన్, సిమెంట్‌తో పాటు బిల్లులు ఎప్పటికప్పుడు అందజేస్తున్నామని త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. తాగు నీరు, కరెంట్, సీసీ రోడ్లు తదితర సౌకర్యాలను కూడా కల్పిస్తామన్నారు. అనంతరం ఎర్రదొడ్డి, లద్దగిరి గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి కార్యాలయ రికార్డులతో పాటు, సిబ్బంది హాజరు, మూవ్‌మెంట్ రిజిష్టర్లను పరిశీలించారు.

☛ సి.బెళగల్: మండల హౌసింగ్ ఏఈ సుమంత్ కంబదహాల్ గ్రామంలోని జగనన్న కాలనీలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట వర్క్‌ఇన్‌స్పెక్టర్ రంగన్న తెలిపారు.

☛ గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను హౌసింగ్ ఏఈ జమ్మన్న పరిశీలించి త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కోడుమూరులో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న వాల్మీకులు

కోడుమూరు రూరల్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని హర్షిస్తూ కోడుమూరులో వాల్మీకులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం కోట్ల సర్కిల్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఎన్నికల హామీ మేరకు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ పార్లమెంట్‌లో బిల్లును ఆమోదింపజేయాలని పలువురు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోరంట్ల సర్పంచు బాలక్రిష్ణ, వాల్మీకులు, వైఎస్సార్‌సీపీ నేతలు లాయర్ ప్రభాకర్, బలరాం, మల్లేష్, అయ్యప్ప, రామగిడ్డయ్య, సుంకన్న, మధు, మహేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి

పాణ్యం: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో బిల్లు తీర్మానించి కేంద్రానికి పంపడం సంతోషించదగ్గ విషయమని జాతీయ వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయర్‌బాబు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ త్వరగా అఖిలపక్షాలతో సమావేశమై సీఎం జగన్‌మోహన్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లు ఆమోదం పొందేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సాధికార సమితి సభ్యులు ఎల్లసుబ్బయ్య, రవిశేఖర్, సుధాకర్, గిరి పాల్గొన్నారు.

సీతారాముల కొలువుతో ఊరంతా పండుగ

● కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



పూజలు చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని ఎదురూరు గ్రామంలో సీతారామ, లక్ష్మణ, హనుమ, పార్వతీ పరమేశ్వర, గణపతి, సుబ్రమణ్య, నందీశ్వర కొలువుతో ఊరంతా పండుగ వాతావరణం నెలకొందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం సాయంత్రం ఎదురూరు గ్రామంలోని సీతారాములు, శివాలయంలో సీతారామ, లక్ష్మణ, హనుమ సమేత పార్వతీ పరమేశ్వర, గణపతి, సుబ్రమణ్య, నందీశ్వర విగ్రహాల ప్రతిష్టలో గణపతిపూజ, పుణ్యాహ వాచనం, రుత్విక్ వరుణం, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, మంగళహారతి, సాయంకాల ప్రదోషకాలపూజ, మత్స్యం గ్రహణం దీక్షాహోమాలు, జపాలు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో ఆంజనేయ, వీరభద్ర, రామేశ్వరస్వామి ఆలయాల చైర్మన్ బోయ వెంకటేశ్వర్లు, గ్రామ ప్రజలు రేపల్లె సామేల్, పెద్ద మద్దిలేటి, దామోదర్, నడిపి అంజి, నరసింహులు, వెంకటస్వామి, అబ్రహం, రాజు నాయుడు పాల్గొన్నారు.

పంచాయతీకి రూ.8.21 లక్షల ఆదాయం

గూడూరు: మార్కెట్ వేలం ద్వారా స్థానిక నగర పంచాయతీకి రూ.8.21 లక్షల ఆదాయం వచ్చింది. శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసు లు అధ్యక్షతన జరిగిన వేలాల్లో కూరగాయల మార్కెట్‌ను సునీతమ్మ దక్కించుకుంది. కాగా వారపు సంత, గొర్రెల మాంసం, గొర్రెల కమేళ, పెద్ద పశువులు మాంసం, పెద్ద పశువుల కమేల వేలాలు వాయిదా పడినట్లు కమిషనర్ తెలిపారు.

29న వేలం పాటలు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో పంచాయతీ ఆస్తిలకు ఈ నెల 29న వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓఆర్‌డీ సుబ్బరాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గేటు సుంకం(బండ్ల మెట్ట) వసూలు చేసుకునే హక్కు, పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన నాలుగు దుకాణాలను ఏడాది కాలం పాటు నిర్వహించుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బండ్ల మెట్టకు రూ.25 వేలు, దుకాణాలకు రూ.వెయ్యి చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

స్కాలర్‌షిప్‌కు విద్యార్థి ఎంపిక



విద్యార్థి సురేంద్ర

గడివేముల: స్థానిక మోడల్ స్కూల్ ఎనిమిదవ తరగతి విద్యార్థి సురేంద్ర నేషనల్ మీన్స్ కం మెరిట్ కం స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శైలజ శనివారం తెలిపారు. విద్యార్థికి ఏటా రూ.12 వేల చొప్పున ఇంటర్ వరకు ప్రభుత్వం స్కాలర్ షిప్ అందిస్తుందన్నారు.

ఆసరా మూడో విడత నిధులు విడుదల

గడివేముల: వైఎస్సార్ మూడో విడత నిధులు మంజూరయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో బటన్ నొక్కి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని మండలంలోని గ్రామ సచివాలయాల్లో పొదుపు మహిళలు, అధికారులు వీక్షించారు. మండలంలోని 597 గ్రూపులకు రూ.2.21 కోట్ల రుణమాఫీ అయినట్లు ఏపీఎం హజరత్ తెలిపారు.

☛ గూడూరు: పట్టణంలోని 1వ సచివాలయం పరిధిలో మెప్మా సీఎంఓ సూర్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం పొదుపు మహిళల సమావేశం నిర్వహించి మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం చెక్కులు అందించారు. సీఎంఓ మాట్లాడుతూ సచివాలయం పరిధిలో 66 సంఘాలకు రూ.33,47,970 మంజూరైందన్నారు. ఈ నగదును మహిళ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ కె.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు రూరల్/సి.బెళగల్: కోడుమూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆయా మండలాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్త, ఆయా పోస్టులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తు స్వీకరణ చేపట్టినట్లు శనివారం సీడీపీఓ వరలక్ష్మి ఒక ప్రకటలో పేర్కొన్నారు. సి.బెళగల్‌మండలం బ్రాహ్మణదొడ్డి–1 కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టుకు ఓసీ, కొత్తకోట–4 కేంద్రంలోని పోస్టుకు ఈడబ్ల్యూఎస్, మారందొడ్డి–2 కేంద్రంలోని పోస్టుకు ఎస్టీ, కోడుమూరు మండలం లద్దగిరి సెక్టారులోని కొత్తపల్లి కేంద్రంలోని పోస్టుకు ఎస్టీ, గూడూరు మండలంలోని జూలకల్ కేంద్రంలోని పోస్టుకు ఈడబ్ల్యూఎస్ వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు సంబంధించి 10వ తరగతి పాసై ఉండాలని, 21 నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉండాలన్నారు. ఆయా పోస్టుకు అభ్యర్థి 7వ తరగతి పాసై ఉండాలని, వివాహితురాలై ఉండాలన్నారు. ఈ నెల 25 నుంచి 29 వరకు ఆయా పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

ఘనంగా ప్రతిష్ఠ విగ్రహాలకు గ్రామోత్సవం



సీతారామాంజనేయుల విగ్రహాలకు పూజలు చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

అవుకు: మండల పరిధిలోని గడ్డమేకలపల్లెలో శ్రీసీతారామాంజనేయ స్వాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజల అనంతరం సీతారామలక్ష్మణ, హనుమంతుడి విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి విగ్రహాలకు, ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడ్డమేకలపల్లెలో సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10లక్షలు సాయం అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, సీఐ సుబ్బరాయుడు, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, కోనేటి సుంకన్న, కోనేటి తిరుపతయ్య, ఈడిగ బాలరాజు, కోనేటి వెంకటేశ్వర్లు, దేవరకొండ గంగన్న, పుల్లన్న, కుళ్లాయప్ప, కోనేటి సుధాకర్, మూరబోయిన మనోహర్, చిన్నతిమ్మయ్య పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి, రథ మహోత్సవాలను పురస్కరించుకుని పాణ్యం ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఈఓ రామానుజన్, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డి,అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 10 మంది డిబార్

కర్నూలు(సిటీ): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ ఒకటి, మూడు, ఐదు సెమిస్టర్ పరీక్షలలో పది మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. 68 కేంద్రాల్లో జరిగిన డిగ్రీ పరీక్షలకు 14,649 మందికి గాను 13,373 మంది హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

విజేత ఒంగోలు వృషభాలు



పోటీలను ప్రారంభిస్తున్న కాటసాని శివనరసింహారెడ్డి

కల్లూరు: ఉగాది ఉత్సవాల సందర్భంగా కల్లూరులో శనివారం నిర్వహించిన బండలాగుడు పోటీల్లో ఒంగోలు వృషభాలు విజేతగా నిలిచాయి. పోటీలను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివనరసింహరెడ్డి ప్రారంభించారు. పోటీలో ఒంగోలు శేషాద్రినాయుడు వృషభాలు మొదటి స్థానం, కర్నూలు పంచలింగాల బైరపోగు బ్రదర్స్ వృషభాలు రెండవ స్థానం కైవసం చేసుకున్నాయి. ఆ తర్వాత స్థానాల్లో వరసుగా డి.రంగాపురానికి చెందిన జూటూరు చిన్నారెడ్డి, ప్యాపిలికి చెందిన దీక్షిత్ ఈశ్వర్, రేమటకు చెందిన నడిపి గిడ్డయ్య, దాసప్ప నాయుడు, వెంకటేశ్వర్లు వృషభాలు నిలిచాయి. విజేతల యజమానులకు బహుమతి దాతలు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.9 వేలు, రూ. 8వేలు, రూ.వేలు అందజేశారు.

తాగు నీటి సమస్య రానివ్వొద్దు

● ఎంపీపీ సునీతమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ సునీతమ్మ

గూడూరు: వేసవికాలంలో గ్రామాల్లో తాగు నీటి సమస్య ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సునీతమ్మ సూచించారు. శనివారం వైఈపీ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అత్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసు కోవాలన్నారు. పశువుల ఆసుపత్రి వైద్యాధికారి సునీల్ మాట్లాడుతూ ప్రభుత్వం పశువుల వైద్యం కోసం గూడూరు, సి.బెళగల్ మండలాలకు ఒక అంబులెన్స్‌ను కేటాయించిందన్నారు. పశువుల ఆరోగ్యం బాగోలేకపోతే 1962 నంబర్‌కు కాల్ చేస్తే పశు వైద్య సిబ్బంది వాహనంతో గ్రామానికి చేరుకుని చికిత్స అందిస్తారన్నారు.ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ మాధవీలత మాట్లాడుతూ సచివాలయ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సర్పంచులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారెడ్డి, ఎంఈఓ సునీలమ్మ, వైఈపీ ఏపీఎం సుధాకర్, వైస్ ఎంపీపీలు రాజమ్మ, సువార్తమ్మ, కో ఆప్షన్ మెంబర్ చనుగొండ్ల దౌల, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.



కంపచెట్లతో నిండిన బస్టాండ్-ఆసుపత్రి రోడ్డు

కంపచెట్లతో నిండిన రహదారి

పాణ్యం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రహదారి కంపచెట్లతో నిండిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నిత్యం రోగులతో ప్రైవేట్ వాహనాలు, 108, 104, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్స్‌లో రాకపోకలు సాగిస్తున్నాయి. బస్టాండ్ నుంచి ఆసుపత్రి వరకు గత ఏడాది రోడ్డు వెడల్పు చేసి గ్రావెల్ రోడ్డు వేశారు. ప్రస్తుతం రోడ్డుకిరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కంపచెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.